# ఆరాధన

—బలివాడ కాంతారావు

తొలిసారి కేరళలో అల్వే పట్టణం వెళ్ళినపుడు నా మిత్రుడు మోహన్ ఆతిధ్యంలో వున్నాను. మోహన్‌కి చాలా విషయాలు తెలుసుగానీ యేవో కొద్ది విషయాలు మీదే నమ్మకం.

"వచ్చే ఆదివారం యెక్కడకు వెళ్దాం" అన్నాడు.

"కాలడి—ఆదిశంకరుల జన్మస్థానానికి" అన్నాను.

"ఆరాధనమీద నాకు నమ్మకం లేదు" తరువాత "Worship. Oh! I don't do at all" ఇంగ్లీషులో అన్నాడు.

"ఈ ప్రాంతంలో కప్పలూ వున్నాయ్. పాములూ వున్నయ్. పాములు కప్పలను మ్రింగడం అందరూ చూశారు. పడగెత్తిన పాము కప్పను రక్షిస్తుండటం అత నొక్కడే చూశాడు'' అన్నాను.

"ఈ కాకమ్మ కథలను నమ్మే నీలాంటి వాళ్ళింకా యీ దేశంలో వుండబట్టే...." అంటూ ఆపేశాడు.

ఆదివారం రానే వచ్చింది. ఉదయమే స్కూటర్ యెక్కాం. వెనుక నేను కూర్చున్నాను. పాము కదలిక యెంత అందంగా వుంటుందో అలాంటి శరీర సౌందికతో కదిలే ఆడవాళ్ళు వచ్చని పొలాల్లో కదులుతున్నారు. కొండచరియలను కూడా రబ్బరు తోటలు ఆక్రమించుకున్నాయ్. కర్ర పెండలం తోటల ప్రక్కనించే పారే కాలువలు నంటుకొని వరిపంట.

మోహన్ అన్నాడు "అటువేపు చూడు—వరిపొలం దగ్గర్లో ఆ మర్రిచెట్టు కనిపిస్తోందా? ఆ క్రింద ఒక శివలింగం వుంది."

"వెళ్ళి చూద్దామా?" అన్నాను.

"తిరుగుదలలో వచ్చేటప్పుడు, నీకు చూడాలంటే చూద్దాం. అది శివలింగం కాదని యీ చుట్టుపట్ల వాళ్ళంటే ఒక శివరాత్రినాడు ఉదయమే యెక్కడినించి వచ్చాడో ఒక సాధు. కాషాయ వస్త్రాలతో విభూతిలో ముఖం చేతులూ ముంచి వచ్చాడు. అది శివలింగమే అన్నాడు. అవునూ కాదూ అన్న వాదన ఆ వారం రోజుల్లో చచ్చిపోయింది. ప్రక్కజిల్లా నుంచి మనుషులు యీ వింత చూడ్డానికి వస్తుంటే యీ చుట్టుపట్లవాళ్ళు చూడకుండా ఎలా వుండగలరు? ఆ సాధు మకంవేసి ఆ చెట్టు దగ్గర్లో భిక్షపాత్ర ఎదుట వుంచి తపస్సు చేసుకుంటున్నాడు. పడగెత్తిన నాగు ఆ రాయిని చుట్టివుంది. అప్పుడప్పుడు తపస్సు చాలించి సాధుగారు ఆ పాము పడగమీద తల వేసేవాడు. అది యేమీ చెయ్యదు. శివభక్తురాలు. మీరు చెయ్యి వెయ్యండి—అంటూ బలవంతాన కొందరిచేత వేయించేవాడు. ఇలా ఆరాధించిన జనం పెరుగుతున్న కొద్దీ సాధువు భిక్షపాత్ర నిండిపోతోంది. పళ్ళూ, కొబ్బరి కాయలూ, బజార్లోనించి వచ్చి సగం రేట్లకు







—జార్లోకి పోయేవి. ఈ కూడబెట్టిన డన్న వదంతి వ్యాపించింది."

 శివకోవెల కట్టించబోతున్నా ఇంతలో ఒక పూరు వచ్చింది. మె

స్కూటర్ ఆపాడు. ఇద్దరం కలిసి హోటల్లో కాలుపెట్టాం. అరటి ఆకుల్లో యిడ్లీ, దోసెలు సేవించి యెవరి ఆకులు వాళ్ళే యెత్తుతున్నాం. శుచికి శుభ్రానికి కేరళకు కేరళే సాటి. మనుషులు కట్టుకున్న తెల్లటి బట్టల్లానే వాళ్ళ చిరునగవులూ తేటగా వున్నాయ్. ఆ దగ్గరలో ఏటి ఒడ్డులో కర్ర దూలాలను లాగుతున్న యేనుగుల్లా, నీటిలో కడుగుతున్న లేలెండు లారీల్లా—కొందరు, మనుషులు వున్నతంగా కనిపించారు. కదులుతున్నారు.

"అయితే తరువాత యేమైంది?...." అన్నాను.

"నీ యెదరగా ఒక రాయిని, ఒక మనిషిని ఒక నాగుపామును నిలబెట్టాను. ఏమైందో వూహించు. నేను చెప్పేస్తే సస్పెన్సు పోతుంది" అన్నాడు మోహన్.

అలా అన్నప్పుడు ఆ విషయం గురించి గుచ్చి గుచ్చి అడగటం యిష్టంలేక ఆలోచనలో పడ్డాను. కాలడి రానే వచ్చింది. యెందుకో నేను వుప్పొంగి పోతుంటే—

"ఇక్క—డేం మహత్యం లేదు...." అన్నాడు.

"శంకరులు పుట్టి పెరిగాడా లేదా? దేశమంతా కాలినడకతో దిగ్విజయ యాత్ర చేసి మళ్ళీ యిక్కడ అతని పాదాల ముద్రలను వేశాడా లేదా?"

"పాతను తల్చుకుని మురిసిపోవటం నా కిష్టంలేదు. ఈ నాటి అల్లకల్లోలం యెవరూ పట్టించుకోటంలేదు."

"అల్లకల్లోలానికి కారణం—నమ్మకం లేకపోవటం" అన్నాను.

మోహన్ నవ్వాడు. నేను పెరియార్ స్వచ్ఛమైన నదీజలాల్లో స్నానం చేస్తూంటే ఒడ్డుమీదే నిల్చున్నాడు. శారదాంబ, శంకరాచార్యుల ఆలయాలను ఆనుకుని పెద్ద మండపం వుంది. దగ్గరలో శ్రీకృష్ణుని దేవాలయం. ఆది శంకరులు కూడా కొలిచిన దైవం అది. ఆ ఆలయం దర్శించి, శారదాంబ ఆలయం చూచి శంకరుని గుడికి వచ్చాను. ఆ వయసు మళ్ళిన నంబూద్రి అతిస్పష్టంగా శ్లోకాలు పారాయణం చేస్తున్నాడు. అతనిని చూడగానే సాంప్రదాయాన్ని రక్షిస్తున్న మహానుభావునిలా కనిపించారు. అతనిమీద గౌరవంతోనే పూజ చేయిస్తున్నాను. ఇలా నేనొక్కడినే వుండగలగడం నా కెంతో మనశ్శాంతి కలిగించింది. పూజ మధ్యలో వుండగా మండపం బయట వరుసగా కార్లు ఆగిన శబ్దం వినిపించింది. ఒకటి కాదు—రెండు కాదు—వరుసగా ఆరు కార్లు. వాళ్ళు దాడి చేస్తారేమో అనుకుంటే ఆడా, మగా, పిల్లా, పిచ్చికా, ఖరీదైన దుస్తులతో నాణ్యమైన నగలతో, నాజూగ్గా నడుచుకుంటూ మండపం లోనికి వెళ్ళారు.

"రక్షించారు బాబోయ్" అనుకుని నంబూద్రి వల్లిస్తున్న సహస్రనామాలను వింటున్నాను.

చప్పున మోహన్—

"నీ స్నేహితు లొచ్చారు"అన్నాడు బయట నిల్చొనే.

"ఎవరా మిత్రు"లన్నాను.

"నీలా మనిషిని కొలిచే వాళ్ళు...." అన్నాడు.

అప్పటికే నా చెవుల్లో నంబూద్రి జపాలకన్నా వాళ్ళ భజనలు గింగురుమంటున్నాయ్. తివాసీలు పరుచుకొని, గోడకు శ్రీ సత్యసాయిబాబా పెద్ద పటాన్ని అన్చి భజనలు చేస్తున్నారు కార్లో దిగినవాళ్ళంతా!


"మరెక్కడా చోటు దొరకలేదా?" అన్నాను వినయంగా.

ఇంతలో నంబూద్రి గొంతుకా పోటీ చేసింది. మనసు అటు మళ్ళీ మళ్ళించాను. యెందుకో నా మనసు నిదానం తప్పినట్లు అనిపిస్తోంది. ఎంత మరచిపోదామన్నా రాయీ, మనిషీ, పామూ, తలలో తిరుగుతున్నాయ్. అక్కడ కోవెల ఎందుకు కట్టలేదు? ఆ పామేమైంది? ఆ మనిషేమయ్యాడు?

చప్పున ఒక విషయం తట్టి మోహన్ని దగ్గరగా పిల్చాను.








"నువ్వు చెప్పింది కట్టుకథ. నన్ను ఫూల్‌ని చెయ్యక" అన్నాను.

"నిజం—తిరుగుదలలో పద—జీవంలేని ఆ రాయిని చూపిస్తాను. జీవంవున్న పామునూ మనిషినీ చూపించమంటే యిప్పుడు మరి చూపించలేను."

"అదే నిజమైతే—యిందులో యేదో సింబాలిజం వుంది" అన్నాను.

"నీకు తట్టింది చెప్పు."

"ఆ పాము-నాగుపాము. ఈ ప్రాంతంలో వున్న ఆకలి. ఈ ఆకలి చుట్టుకున్నా చలించని అధికారి ఆ లింగం."

"మరి ఆ మనిషో?"

"ఆకలిని సృష్టించినవాడు-స్వప్రయోజనం కోసం."

"నీ మాటల్లో కొంత నిజం వుందనుకో. కాని అసలు యేం జరిగిందో మనం తిరిగి వెళ్ళిపోయే సరికైనా వూహించి చెప్పు" న్నాడు మోహన్.

మా చివరి మాటలు మాకే వినిపించనంత గట్టిగా సాయిబాబా భజన సాగుతూంటే నంబూద్రి విసిగి పూజను నిలిపివేసాడు. తీర్థం ప్రసాదం యిచ్చేసాడు, విసుక్కుంటూ. ఇంతలో చప్పున బయట కార్లాగిన శబ్దం వినిపించింది. ఇక్కడ భజనకూడా ఆగిపోయింది. పొలో పొలోమని అందరూ లేచిపోయారు. పోలీసులు టియర్‌గ్యాస్ బల్బులు విసిరారా? లేక బాబాగారు స్వయంగా విచ్చేసారా?

తెల్లని వస్త్రాలు. తేటైన మనిషి. వెంట పరివారం. నిజంగా పోలీసు పెద్దలున్నారు. కానీ చేతిలో టియర్‌గ్యాస్ బల్బులు లేవు. ఆ వచ్చిన మంత్రివర్యుని రక్షణార్థం కాపోసు పిస్తోల్లు మొలల్లో రబ్బరు కవర్లలో వున్నాయి. బాబా బొమ్మకు సాష్టాంగ పడినివాళ్లు యీాయన యెదరగా పడ్డారు. ఆడవాళ్ళు నమస్కార హారాలను చిరునగవు హారాలుగా స్వీకరించి, వయసు మరచిపోయి, వంకచూపులు చూసి, ఒకటో, అరో, జోకులు విసిరి, చివరకు బాబా

బొమ్మకు చిన్న విష్‌లా చేతులు జోడించగానే-ఇంతవరకూ భ జ న లు చేస్తున్నవారంతా సాష్టాంగపడి బాబా బొమ్మను మొక్కారు. ఇదంతా బాబాగారి చలవే అన్నారు. ఎప్పుడైతే నంబూద్రికూడా పరుగెత్తుకుని వచ్చి ఆ పెద్ద ముందు సాష్టాంగపడ్డాడో—

"పద-మోహన్ పోదాం" అన్నాను. నా శరీరం మండి పోతోందని తెలుసుకున్న మోహన్ చిరునగవుతో నాలో మంటలు లేపాడు. తిరిగి పోతున్నా నేను మాట్లాడలేదు.

"చాల డిసపాయింట్ అయినట్లున్నావే?" అని యింగ్లీషులో అన్నాడొకసారి. నేను జవాబు చెప్పలేదు. నా మనసు తెలుసుకున్నట్లు.

"అవును-కాలినడకతో నడిచే, పిన్నవయసులో దేశాన్నంతా ఒకటి చేసాడనీ-అతని జన్మ స్థానంలో కాలుపెట్టే-ఈ రోజుల్లో రాజకీయాలు సృష్టించిన అవకతవకలు, యెడబాట్లు, కడుపు, కులం, మతం పేరిట మనిషికి మనిషికీ మధ్య సృష్టించిన అగాధాలు ఏకత్వం సాధించడానికి అవకాశం యివ్వని అన్ని రంగాల్లోనూ అల్లుకున్న వెధవ పోలిటిక్స్ - మనుషుల్లో యీ భావ దారిద్ర్యం విరజిల్లిన గాఢాంధకారం-ఇవన్నీ పారద్రోలగలనన్న ఆశనిచ్చే ఒక వెలుగులాంటి చిన్న ఆలోచన యీ ప్రదేశంలో కాలుపెత్తే - వస్తుందనుకుని వచ్చావు - కానీ కానీ."

అంటూ ఆపేసాడు. కొంతదూరం పోయాక మళ్ళీ ఉదయం యిడ్లీ తిన్న హోటల్లో కాఫీ తాగాం. మోహన్ సిగరెట్ ముట్టించాడు.

"స్కూటర్ మీద పోతూ మాట్లాడుకునే కంటే యిక్కడే కాస్సేపు మాటాడుకుందాం" అని యిద్దరం పనసచెట్టు నీడలో ఒక కర్రబల్ల వుంటే దానిపై కూర్చున్నాం.

"ఇక నేను పాముగురించి చెప్పవచ్చా?" అన్నాడు.

నేను మౌనంగా చూసాను.

"ఆ మర్రిచెట్టు క్రింద శివాలయం యెందుకు కట్టలేదో తెలుసా?"

"ఏమో? ఏదో మోసం వుండాలి."

"ఆ శివలింగాన్ని కొలిచిన వాళ్ళంతా పల్లె నించి వచ్చిన ఉత్తి అమాయకులంటే నమ్ముతావా?"

"నమ్ముతాను"

"మరి బాబాను కొలుస్తున్న యీ పట్నవాసులు అమాయకులంటావా?"

"కాదు. తెలివైనవాళ్ళు"

"ఆ అమాయకులూ, ఈ తెలివైనవాళ్ళూ-అంతా దేన్ని కొలిచారు? కొలుస్తున్నారు?"

ఇంకా నా కంటిలో ఆ నంబూద్రి చివరి ఘట్టం తిరుగుతూ నా మనసును ద్రవిస్తోంది.

"ఆ అమాయకులు, యీ తెలివైనవాళ్ళూ-వీళ్ళూ వాళ్ళూ అనక - ఈ దేశంలో ప్రతి మనిషీ, పిల్లా, పిచ్చికా, ఆకూ అలమూ, కాకీ కోవెలా, గాలీ, నీరూ - ఒకటేమిటి మోహన్? అన్నీ ఇవీ అవీ, ఇప్పుడూ అప్పుడూ - ప్రతి నిముషం-అధికారాన్ని కొలుస్తున్నాయ్, ఆరాధిస్తున్నాయ్, పూజిస్తున్నాయ్—"

ఇలా అందామని అనుకున్నానేగానీ నాలో చప్పున రేగిన ఒక తలపు నా గొంతుకను నొక్కివేసింది.

"నువ్వెందుకు గుడికి వెళ్ళటం లేదో నాకిప్పుడు అర్థమైంది" అన్నాను.

"నా కిష్టంలేదు — వెళ్ళలేదు — అంతే" అన్నాడు.

"కోరికలు తీర్చే అధికారిగా దేముడ్ని మనం సృష్టించుకున్నాం. అధికారానికి తల వంచి, అవసరమైతే ధిక్కరించే హక్కును కోల్పోవటం నీ కిష్టంలేదు కదూ?" అన్నాను చిరునగవుతో సాదరంగా.

మోహన్ కళ్ళల్లో మెరుపు కనపడింది.

కాస్సేపయ్యాక స్కూటర్ యెక్కాం.

స్కూటర్ మెల్లగా నడుపుతూ "శివలింగాన్ని చూస్తావా?"

"వద్దు."

"ఆ పాము, సాధు యేమయ్యారో చెప్పేదా?"

"వద్దు"

"కాలడిలో కాలుపెట్టేక వెలుగులాంటి ఆలోచన నిజంగా వచ్చిందే" అన్నాడు నవ్వుతూ.

తరవాత స్కూటర్ నడుస్తున్న చప్పుడు వినిపించింది.

